ప్రజాశక్తి

గురువారం 4 మే 2023 5

పార్వతీపురం మన్యం

వర్షాలకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

పార్వతీపురం: వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరిక చేసిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అప్రమత్తం చేశారు. ఇందులో భాగంగా కలెక్టరేట్ కంట్రోల్‌రూమ్ -08963 293046 ఏర్పాటు చేశారు. వర్షాల వల్ల ఏర్పడిన నష్టాలు తదితర సమాచారాన్ని కంట్రోల్ రూంకు అండించవచ్చుని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో వర్షాలకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు రెవిన్యూ డివిజనల్ అధికారి కె. హేమలత తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ బుధవారం రాత్రి 8 నుండి 7వ తేదీ ఉదయం 8 గంటల వరకు నిరంతరం పనిచేస్తుందన్నారు. కావున 7382044830, 6301921051, 8317668450, 7382044830, 6305110430, 7981675410, 6301921051, 9490115460 కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

శ్రామికరాజ్య స్థాపనకై

పోరాడిన యోధుడు శ్రీరామ్మూర్తి

- ఆయన ఆశయాలను నెరవేర్చడమే నిజమైన నివాళి
- ద్వితీయ వర్ధంతి సభలో వక్తల పిలుపు
- శ్రీరామ్మూర్తి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి- పార్వతీపురం

కారల్ మార్క్స్ చూపిన కమ్యూనిజం బాటలో శ్రామిక రాజ్యం స్థాపనకై అలుపెరగని పోరాట యోధుడిగా పార్వతీపురానికి వన్నెతెచ్చిన కమ్యూనిస్టుగా అమరుడైన రెడ్డి శ్రీరామ్మూర్తి (ఆర్ఎస్ఎం) ఆశయాలను నెరవేర్చడమే ఆయనకు మనమిచ్చే నిజమైన ఘన నివాళి అని పలువురు వక్తలు మాట్లాడారు. రానున్న వర్ధంతికి రెడ్డి శ్రీరామ్మూర్తి విజ్ఞా కేంద్రం ఏర్పాటుకు కృషి ప్రతినబూనారు. బుధవారం స్థానిక గిరిజన సామాజిక భవనంలో రెడ్డి శ్రీరామ్మూర్తి ద్వితీయ వర్ధంతి సభ సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు అధ్యక్షతన జరిగింది. తొలుత మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ మంచి కామ్రేడ్‌గా శ్రీరామ్మూర్తి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో నడవడమే ఆయనకిచ్చిన ఘనమైన నివాళులన్నారు. వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలో పేదల సమస్యలు పరిష్కరించడం శ్రీరామ్మూర్తి ప్రత్యేకత కలిగిన కామ్రేడ్ అని కొయాడారు. పట్టణ వాసులకు ఆయన లేని లోటు తీరనిదన్నారు. పార్వతీపురం ప్రధాన రహదారిలో ఏదో ఒక జంక్షన్ వద్ద ఆయన విగ్రహం ఏర్పాటుకు తన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. డాక్టర్ యాళ్ల వివేక్ మాట్లాడుతూ తోటపల్లి నిర్వాసితుల సమస్యలపై శ్రీరామ్మూర్తి పెద్ద పోరాటం చేసి వారికి న్యాయం జరిగేలా కృషి చేసిన గొప్ప కమ్యూనిస్టు నాయకుడన్నారు. పేదల కోసం తమ వంతు సహాయ సహకారాలు అందించే వారమని, ఎల్లప్పుడూ తన సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ప్రముఖ కవి గంటేడ గౌరినాయుడు మాట్లాడుతూ లాఠీలకు, తూటాలకు బెదరకుండా అనునిత్యం సమైక్యరాజ్యం కోసం ప్రజా జీవితాన్ని గడిపిన రెడ్డి శ్రీరామ్మూర్తి అంటే రెడ్ శ్రీరామ్మూర్తిగా పిలవడమే సముచితం అన్నారు. మరో కవి పక్కి రవీంద్ర మాట్లాడుతూ శ్రీరామ్మూర్తి నర నరాల్లోనూ కమ్యూనిజం ప్రవహించే ఉవ్వెత్తిన ఉప్పొంగే ఎర్రటి ఉద్యమ సముద్రపు కెరటమన్నారు. ఎప్పటికీ ఇంకని సముద్రపు నీరలాగే కామ్రేడ్ ఆర్ఎస్ఎం ఆశయాలకు మరణం లేదన్నారు. సిపిఎం శ్రీకాకుళం జిల్లా నాయకులు బి.కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ సభ్యులుగా శ్రీరామ్మూర్తితో కలిసి పనిచేయడం మా మధ్య ఉద్యమ స్నేహ సంబంధాలు మరువలేని అన్నారు. ఆయన ఉద్యమ స్ఫూర్తితో కమ్యూనిస్టులంతా పనిచేయడం ఆయనకిచ్చిన నిజమైన నివాళి అని అన్నారు. సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్వాసితుల పోరాటంలో కలిసి పని చేసిన సందర్భాలు మరువ లేనివన్నారు. భోగాపురం చేరుకునేందుకు పార్వతీపురం నుంచి పోలీసుల ఆంక్షలను అధిగమిస్తూ వారి కంటపడకుండా రాత్రంతా కాళ్ల నడకన నిద్రాహారాలు లేకుండా ఎయిర్ పోర్టు ఉద్యమంలో పాల్గొనే తీరు ఉద్యమ స్ఫూర్తికి నిదర్శనమన్నారు. అలాంటి కామ్రేడ్ భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలు సజీవంగా ఉంటాయని వాటిని కొనసాగించడమే నిజమైన నివాళులు అన్నారు. ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర కార్యదర్శి జివి కిషోర్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా కార్మిక, ఉద్యోగుల సమస్యలపై శ్రీరామ్మూర్తితో కలిసి పని చేశామన్నారు. సమయస్ఫూర్తి, విషయ పరిజ్ఞానంతో సమస్యలపై పోరాడినప్పుడు మనం ఇతరుల గౌరవాన్ని పొందగలమని సలహాలిస్తూ కార్యక్రమాన్ని ముందు నడిపే వారిని గుర్తు చేశారు. ఆయన అడుగుజాడల్లో నడవడమే ఆయనకిచ్చిన ఘనమైన నివాళి అని అన్నారు. శ్రీరామ్మూర్తి భార్య నిత్యం ఆఫీసులోనే అందరికీ అందుబాటులో ఉండి పనిచేసిన శ్రీరామ్మూర్తి లేకపోవడం అంథకారంగా ఉందన్నారు. ఆయన అడుగుజాడల్లోనే నడుచుకుంటూ ఆయన ఆశయాలను కొనసాగిస్తానన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ 1987లో రెడ్డి వానివలసలో ప్రారంభమైన ఉద్యమం జిల్లావ్యాప్తంగా విస్తరింపచేయడంలో ఎం.కృష్ణమూర్తి సహకారంతో 30 ఏళ్లుగా శ్రీరామ్మూర్తితో ఉద్యమ సహజీవనం సాగించానన్నారు. మార్క్సిజం దిక్సూచిగా పనిచేసిన శ్రీరామ్మూర్తి ఆశయాలు నెరవేరడానికి ఆయన పేరున విజ్ఞాన కేంద్రం వచ్చే వర్ధంతి లోపు ఏర్పాటుకు సిపిఎం కృషి చేస్తుందని, అందుకు అందరి సహాయ సహకారాలు అందించాలని కోరారు. జనసేన నాయకులు వి.దాలినాయుడు మాట్లాడుతూ శ్రీరామ్మూర్తిలో ఉద్యమ స్మృతులు భావితరానికి గుర్తుగా పార్వతీపురంలో ఒక జంక్షన్‌కు ఆయన నామకరణతో విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానని అందుకు అంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీరామ్మూర్తి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతిరావు, వై.మన్మధరావు, వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు బంటు దాసు, కొల్లి సాంబమూర్తి, గొర్లి వెంకటరమణ, ఎన్‌వై నాయుడు, శ్రీరామ్మూర్తి కుటుంబ సభ్యులు, సిపిఐ నాయకులు టి.జీవ, జిల్లా నలుమూలల నుండి పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు, శ్రేయోభిలాషులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరీశ్వరి

గౌరునాయుడు

గున్నేశ్వరరావు

బి.కృష్ణమూర్తి

టి.సూర్యనారాయణ

రెడ్డి శ్రీదేవి

కిశోర్

వివేక్

రెడ్డి వేణు

రవీంద్ర

రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

అంగన్వాడీ గడపలోనే కూర్చొని రికార్డులను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సిబ్బంది విధుల నిర్వహణలో అలసత్వం వద్దని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. మండలంలోని ఎగువ తాడికొండ అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎగువతాడికొండ అంగన్వాడీ కేంద్రంలో గడపలోనే కూర్చుని రికార్డులను పరిశీలించారు. రికార్డుల్లో పిల్లలు, కిశోర్ బాలికలు, గర్భిణీలు, బాలింతలు, ఇటీవల ప్రసవించిన తల్లుల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల నమోదుకు వాస్తవ వివరాలకు తేడాలు గమనించిన జిల్లాకలెక్టర్ సిబ్బందిని ప్రశ్నించారు. ప్రసవించిన తల్లుల వివరాలు లేకపోవడం, తప్పులు నమోదు చేయడం, ప్రసవించి నాలుగు రోజులైనా యాప్‌లో నమోదు కాక పోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్వాడీ సిబ్బంది, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ ఇచ్చిన వివరాలలో తేడాలు గమనించిన జిల్లాకలెక్టర్ ఇకపై ఇదేవిధంగా విధులు నిర్వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్, ఎఎన్ఎం, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రంలో తల్లులతో ముఖా ముఖి మాట్లాడుతూ ఐరన్ మాత్రలు, పౌష్టికాహారం ఆహార పదార్థాల కిట్లు, గుడ్లు సకాలంలో ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యంపై తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నారా, టేక్ హోమ్ రేషన్ ఇస్తున్నారా అంటూ ఆరా తీశారు. గ్రామంలో రక్తహీనత గల పిల్లలు, తల్లుల వివరాలు తెలుసుకొని వారి సంఖ్యను తగ్గించాలని అన్నారు. వారికి సరైన అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రంలో వంటగది, ఆహార పదార్థాలను పరిశీలించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది హాజరు పట్టీ, ప్రసవం జరిగిన వివరాలు, చికిత్స పొందుతున్న వారి వివరాలు పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్, శానిటేషన్ పరిశీలించారు. పారిశుధ్యం పక్కాగా పాటించాలని, డ్యూటీ డాక్టర్లు శ్రద్ధ వహించాలని ఆయన పేర్కొన్నారు. ప్రసవాల రికార్డు పరిశీలించగా ఇటీవల డెలివరీ అయిన తల్లుల వివరాలు లేకపోడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై ఇలాంటి తప్పులు జరిగితే తగిన చర్యలు ఉంటాయని అన్నారు. ప్రధాన మంత్రి అవాస్ యోజన కింద ఇళ్లు నిర్మిస్తున్న లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఐసిడిఎస్ పిడి కె.విజయగౌరి, తహశీల్దార్ జె.రాములమ్మ, వైద్యాధికారి ఎం.బుద్దేశ్వరరావు, ఎంపిడిఒ సాల్మన్‌రాజ్, సచివాలయ, అంగన్వాడీ సిబ్బందిపాల్గొన్నారు.

ఐటిఐలో ల్యాబ్‌లు, ఇతర వివరాలను ప్రిన్సిపల్ అడిగి తెలుసుకుంటున్న పిఒ కల్పనకుమారి

ఎంసెట్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఎంసెట్ అర్హత పరీక్ష కోసం ఏర్పాటు చేసిన కోచింగ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిఎ పిఒ కల్పన కుమారి అన్నారు. బుధవారం. స్థానిక బాలికల గురుకుల కళాశాలను పిఒ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదివి మంచి ర్యాంకులు సాధించాలని కోరారు. ఎటువంటి ఒత్తిడికి లోనుకాకూడదన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు అవసమయ్యే మెటీరియల్‌ను అందించాలని సూచించారు. అనంతరం అక్కడే ఉన్న బాలికల గురుకుల పాఠశాలను పరిశీలించారు. మొదటి విడతలో జరిగిన నాడు-నేడు పనులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఐటిఐని సందర్శించారు. కళాశాలలో ఉన్న అన్ని విభాగాలను పరిశీలించారు. కళాశాల నిర్వహణ చాలా బాగుందని, అన్ని విభాగాలకు ల్యాబ్ సౌకర్యం ఉందని అన్నారు. దీన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. కళాశాలలో విద్యుత్, నీటి సమస్య ఉందని పిఒ దృష్టికి విద్యార్థులు తీసుకురాగా, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పిఒ సందర్శించారు. కళాశాల నిర్వహణ సక్రమంగా లేదని, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించలేకపోవడంపై పిఒ అసంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా ఆరేళ్ల క్రితం ఇచ్చిన కంప్యూటర్లను ఇప్పటికీ వినియోగంలోకి తీసుకురాక పోవడమేమిటని ప్రిన్సిపల్‌ను ప్రశ్నించారు. ఈ సంధర్భంగా విద్యార్థులతో పీవో మాట్లాడారు. మరుగుదొడ్లు బాగులేవని, హాస్టళ్లలో భోజనం బాగులేదని విద్యార్థులు చెప్పగా, సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకొంటానని హామీ ఇచ్చారు. అదే విధంగా వారం రోజుల్లో కళాశాలలో అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. పిఒ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జ్యోతికుమారి, ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ టి.వి.గిరి, బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపల్ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

మామిడి, జీడి రైతుల సమస్యలపై 8న కలెక్టరేట్ వద్ద ధర్నా

విజయనగరం : జిల్లాలో మామిడి, జీడి మామిడి రైతుల సమస్యలపై ఈ నెల 8న చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమానికి రైతులు తరలిరావాలని ఎపి రైతు సంఘం కార్యదర్శి బి.రాంబాబు పిలుపునిచ్చారు. బుధవారం కొత్తవలస మండలంలో నిమ్మలపాలెం, పాత సుంకరపాలెం, ఎర్రవానిపాలెం, కొత్త సుంకరపాలెం, కొత్తూరు, కంటకాపల్లి, కాటకాపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి, జీడికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలని, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

సభలో మాట్లాడుతున్న సిఎం జగన్

జాబ్‌హబ్‌గా ఉత్తరాంధ్ర

- వెనుకబాటు తనం నుంచి ఉపాధి కల్పనవైపు
- ఎంతో అభివృద్ధి చేశాం.. మరెన్నో చేపడతాం
- ఎయిర్‌పోర్టు శంకుస్థాపన సభలో సిఎం జగన్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/భోగాపురం/డెంకాడ

ఒకప్పుడు ఉత్తరాంధ్ర అంటే వలసలు పోయే శ్రమజీవులుగా ఉన్న గుర్తింపును తిరగరాసి జాబ్‌హబ్‌గా తీర్చిదిద్దుతామని సిఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఉద్యోగాల కోసం ఉత్తరాంధ్రకు రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. విశాఖలో ఏర్పాటు కానున్న అదానీ డేటా సెంటర్ ద్వారా వైజాగ్ జాబ్‌హబ్‌గా మారబోతుందన్నారు. సబ్ మెరైన్ కేబుల్ కనెక్టివిటీ.. ఐటి రంగం అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఒకవైపున శ్రీకాకుళం జిల్లా మూలపాడు పోర్టు, మరోవైపు అంతర్జాతీయ విమానాశ్రయం ఇవన్నీ రూపురేఖలు మారుస్తాయని చెప్పారు. టూరిజం, మెడికల్ టూరిజం, ఐటి ఇండస్ట్రీ పరంగా సాధించాల్సిన ప్రగతికి కూడా ఎయిర్‌పోర్టు రాబోయే రోజుల్లో కేంద్రబిందువుగా మారుతుందని తెలిపారు. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయన్నారు.

భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నిర్మాణం, తారకరామతీర్థసాగర్ ప్రాజెక్టు, చింతపల్లి వద్ద ఫిష్ ల్యాండింగ్ సెంటర్ పనులకు బుధవారం సిఎం జగన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఆకాశమంత పెద్దమనుసుతో రైతులు భూములిచ్చి సహకరించారని అన్నారు. వారందరికీ పోలిపల్లి, గూడెపువలస వద్ద 50 ఎకరాల్లో రూ.80 కోట్లతో గేటెడ్ కమ్యూనిటీ తరహాలో రెండు పునరావాస గ్రామాలను ప్రభుత్వం నిర్మించి తరలించిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో అనేక కేసులన్నింటినీ పరిష్కరించామన్నారు. మరోవైపు భూసేకరణ కూడా పూర్తి చేసి, కేంద్రం నుంచి అన్ని అనుమతులు తీసుకొచ్చామన్నారు. గతంలో చంద్రబాబు ఇవేవీ పూర్తి కాకుండా శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. తిరిగి ఏమాత్రమూ సిగ్గు లేకుండా గతంలోనే తాము శంకుస్థాపన చేసినట్టు చెప్పుకుంటున్నారని ఎద్దేవాచేశారు.

ఉత్తరాంధ్రకు మూలపేట పోర్టు మణిహారమైతే ఎయిర్‌పోర్టు కిరీటం వంటిదని అన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాలకు దాదాపు సమాన దూరంలో ఉన్న ఈ ఎయిర్‌పోర్టు కేవలం ఉత్తరాంధ్రకే కాకుండా రాష్ట్రానికీ కేంద్ర బిందువు కాబోతుందన్నారు. ఇందుకనుగుణంగా ఉత్తరాంధ్రలోనూ, ఇతర ప్రాంతాల నుంచి రహదారులను అనుసంధానం చేస్తామని వివరించారు.

విజయనగరం మెడికల్ కాలేజీని ఈ ఏడాది ఆగస్టు లేదా సెప్టెంబరులో ప్రారంభిస్తామన్నారు. సాలూరులో తలపెట్టిన గిరిజన యూనివర్సిటీకి భూసేకరణ పూర్తయిందని, ఈ ఏడాది జూన్ లేదా జూలైలో శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు.

పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా గ్రామం నుంచి జిల్లా స్థాయికి మాత్రమే కాకుండా.. రాజధానుల స్థాయికి కూడా తీసుకెళ్లాలన్నది తమ ప్రభుత్వ విధానమన్నారు. అందులో భాగంగా అందరికీ ఆమోదయోగ్యమైన నగరం విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబరులో విశాఖలో కాపురం పెడతానని చెప్పారు.

పేదలకు ఇళ్ల ఇళ్లపట్టాలు అందనీయకుండా బాబు కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలని ప్రయత్నం చేశారని ఆక్షేపించారు. త్వరలో డిజిటల్ లైబ్రరీలు కొన్ని గ్రామాల్లో కడుతున్నామని, వర్క్ ఫ్రం హోం వంటివాటికి దోహదపడతాయని అన్నారు. 28 ఏళ్లలో బాబు వల్ల రాష్ట్రానికి ఎలాంటి మేలూ జరగలేదన్నారు. చంద్రబాబు, జగన్‌కు మధ్య తేడా ప్రజలు గమనించాలని, తాను చేపట్టిన పథకాల వల్ల మంచి జరిగిందనుకుంటే ఆశీర్వదించాలని కోరారు.

అంతకు ముందు కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, సీదిరి అప్పలరాజు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఉత్తరాంధ్రకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వాహనంపై కూలిన కటౌట్

ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన నేపథ్యంలో భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి సభా వేదిక వద్దకు చేరుకున్న వెంటనే భారీ ఎత్తున వర్షం కురవడంతో వేదిక ప్రాంగణ సమీ పమంతా జల మయమైంది. చిన్న ఈదురు గాలులు వీయడంతో పక్కనే అందుబాటులో ఉంచిన అగ్నిమాపక వాహనంపై కటౌట్ పడింది. ఆ సమయంలో ఎవరూ అక్కడ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. తర్వాత సిబ్బంది కటౌట్ తొలగించి వాహనాన్ని పక్కకు తీశారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్/మక్కువ

దళారీల ప్రమేయం లేకుండా మహిళలు స్వయం సవృద్ధి సాధించాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ అన్నారు. సాలూరు మండలం పలుగు చెన్నూరు, మక్కువ మండలం మార్కొండపుట్టి, అనసభద్ర గ్రామాల్లో బుధవారం పర్యటించిన పిఒ వన్ ధన్ వికాస్ కేంద్రాలను (విడివికె), పసుపు ప్రాసెసింగ్ కేంద్రాలను, పసుపు పంటను పరిశీలించారు. మార్కొండపుట్టిలో అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. స్వయం సహాయక సంఘాల సభ్యులతో ముఖాముఖి మాట్లాడారు. అటవీ ఉత్పత్తులు, స్థానికంగా లభించే ఉత్పత్తులను విడివికెలు సేకరించి విలువ ఆధారిత పెంచాలని ఆయన సూచించారు. ఉత్పాదకాల సేకరణ సమయంలో వడ్డీ వ్యాపారుల నుంచి రుణాలు తీసుకోవడం వంటి పనులు చేయరాదని ఆయన చెప్పారు. సంఘాల ద్వారా అవసరం మేరకు రుణాలు తీసుకునే వెసులుబాటు ఉందన్నారు. జీడి పప్పుకు మార్కెట్‌లో గిరాకీ ఉందని, ప్రాసెసింగ్‌లో సరైన చర్యలు చేపట్టి నాణ్యతలో రాజీ లేకుండా పని చేయాలని సూచించారు. పసుపు పంట దశ నుండి అవసరమైన చర్యలు చేపట్టడం వల్ల వాటి నాణ్యత చక్కగా ఉండి మరింత గిరాకీ పెరుగుతుందని చెప్పారు. పిఒ వెంట టిపిఎంయు ఏపిడి వై.సత్యంనాయుడు పాల్గొన్నారు.

మక్కువలో గిరిజనులు సాగు చేస్తున్న పసుపును పరిశీలిస్తున్న పిఒ విష్ణుచరణ్

నాలుగేళ్లలో ఉత్తరాంధ్రకు చేసిందేంటి?

మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు

ప్రజాశక్తి- బొబ్బిలి

నాలుగేళ్లలో ఉత్తరాంధ్రకు సిఎం జగన్మోహన్‌రెడ్డి చేసిందేంటని, ఉత్తరాంధ్ర అభివృద్ధి ఇప్పుడు గుర్తురావడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు ఎద్దేవా చేశారు. ఆయన బుధవారం కోటలో విలేకర్లతో మాట్లాడుతూ జగన్ భోగాపురంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి మరోమారు శంకుస్థాపన చేయడం హాస్యాస్పదామన్నారు. భోగాపురంలో అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్ నిర్మాణం జరగాలనే చిత్తశుద్ధితో కేంద్రాన్ని ఒప్పించి అనుమతులు తీసుకువచ్చిన ఘనత చంద్రబాబుకు, అప్పటి కేంద్ర పౌరవిమనయాన శాఖా మంత్రి అశోక్ గజపతిరాజుకి దక్కుతాయని సుజయ్ అన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు మధ్యలో ఎయిర్పోర్ట్ నిర్మాణం జరిగితే ఉత్తరాంధ్ర అభివృద్ధికి దోహదపడుతుందనే తలంపుతో ఆనాడు భోగాపురం ఎయిర్‌పోర్టు స్థలాన్ని ఎంపిక చేసి కేంద్రాన్ని ఒప్పించిన నాయకుడు చంద్రబాబు అని సుజయ్ స్పష్టం చేశారు. కొందరు వైసిపి నేతలు కోర్టులను ఆశ్రయించి స్థల సేకరణ కొంతమేర అడ్డుకున్న సంగతి జగన్ మర్చిపోయారా అని సుజయ్ ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు రెండువేల ఎకరాలు అవసరం లేదు కేవలం ఐదారొందల ఎకరాలు చాలు అంటూ రైతులను రెచ్చగొట్టిన జగన్ ఇప్పుడు మాట తప్పి మడమ తిప్పారా అని మండిపడ్డారు. ఎన్నికల సమయం అసన్నమయ్యేసరికి సదరు ప్రాజెక్టులకు మరల శంకుస్థాపన కార్యక్రమాలకు జగన్ సర్కార్ దిగడం ఓ నీచమైన చర్యగా సుజయ్ అభివర్ణించారు. ఉత్తరాంధ్రలో ఒక్క సీటు కూడా గెలవలేరని పీకే టీమ్ సర్వే చెప్పడంతో జగన్ సరికొత్త డ్రామాలకు తెరాలేపారని విమర్శించారు.

ఒకేరోజు ఇంత మంది సెలవులా

పాలకొండ రూరల్ : సచివాలయంలో ఒకేరోజు ఏడుగురు సెలవు పెట్టడమేమిటని, అసలు మీకు సెలవు ఎలా మంజూరు చేశారని డిఎల్‌డిఒ వి.వి.గోపాలకృష్ణ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని తుమరాడ సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బంది హాజరుపట్టీతో పాటు మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. కేవలం నలుగురు మాత్రమే విధుల్లో ఉన్నట్టు గుర్తించి తీవ్ర ఆగ్రహం చెందారు. ఒకేరోజు ఇంతమంది సెలవులు పెడితే సేవలు ఎలా అందిస్తారని ప్రశ్నించారు. అలాగే సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలపై కూడా అసంతృప్తి చెందారు. ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదన్నారు. ఇలా అయితే ఎలా అంటూ ప్రశ్నించారు.

72 గంటల పాటు నిరాహార దీక్ష

కురుపాం : బోయ, వాల్మీకి బెంతుఒరియా కులాలను ఎస్టీ జాబితాలో చేర్చే తీర్మానం వెంటనే వెనక్కి తీసుకోకపోతే మే 11 నుంచి మూడు రోజులపాటు (72 గంటలు) కురుపాం నియోజక వర్గ కేంద్రంలో నిరాహార దీక్ష చేపడుతున్నట్లు గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే అసలైన గిరిజనులు రిజర్వేషన్లు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఎంతో మంది యువత చదువుకొని నిరుద్యోగులుగా మిగులుతున్నారన్నారు. అలాంటిది ఇప్పుడు బోయ, బెంతు వాల్మీకులను ఎస్టీల్లో చేర్చే తీర్మానం వెనక్కి తీసుకుని గిరిజన హక్కులకు భంగం కలిగించకుండా చూడాలన్నారు. లేనిచో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

నాటుసారా దాడిలో పట్టుబడ్డ నిందితుడు

'నాటు నాటు' వార్తకు స్పందన

కురుపాం : నాటుసారా విక్రయాలు, తయారీపై 'ప్రజాశక్తి'లో మంగళవారం ప్రచురితమైన నాటు నాటు అనే వార్తకు స్పందించిన ఎల్విన్‌పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. సత్యనారాయణ, ఎపిఎస్‌పి పార్టీ, తన సిబ్బందితో కలిపి బుధవారం తన సర్కిల్ పరిధిలో గల కురుపాం మండలం ఉదయపురం పంచాయతీలో కాకితాడ, గుమ్మ పంచాయతీలో గల గుమ్మ, గదబవలస గ్రామాలను సందర్శించి నాటుసారా స్థావరాలపై దాడి చేసి 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని ఇద్దరుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా ప్రభావితమైన సారా తయారీ, అమ్మకాలు చేపడుతు ముద్రపడి గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తెలిపారు. సారా తాగడం వల్ల కుటుంబాల ఆర్థిక పరిస్థితి ఎంత దుర్భరమవుతుందో విపులంగా తెలియజేసి నాటు సారా నిర్మూలన శత శాతం కృషి చేస్తామని అన్నారు. ఇంకా ఎక్కడైనా నాటుసారా తయారీ, అమ్మకాలు చేపడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎస్ఐ వి.షన్ముఖరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధి పనుల పరిశీలన

సీతానగరం : మండలంలోని జానుములవలస, వెన్నెలబుచ్చంపేటలో జరుగుతున్న చెరువుల అభివృద్ధి పనులను ఎంపిడిఒ ఎంఎస్ఎన్ఎల్ ప్రసాద్ బుధవారంపరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన చెరువు మన గ్రామం పేరుతో ప్రభుత్వం చెరువుల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఈ పథకంలో భాగంగా అన్ని గ్రామాల్లో ఉండే అన్ని చెరువుల అభివృద్ధికి జరుగుతుందన్నారు. దీనికి గ్రామస్తుల సహకారంతోనే అభివృద్ధి చేయొచ్చన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రామ పెద్దలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

శ్రీరామ్మూర్తి లేని లోటు తీరనిది

పార్వతీపురం రూరల్ : పార్వతీపురం పట్టణంతో పాటు నియోజకవర్గంలో సిపిఎం నాయకులు దివంగత రెడ్డి శ్రీరామ్మూర్తి లేని లోటును భర్తీ చేయలేరని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. బుధవారం కామ్రేడ్ రెడ్డి శ్రీరామ్మూర్తి ద్వితీయ వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభకు హాజరైన ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల పక్షపాతి అయిన ఆయన అవసరం ఇప్పటి పరిస్థితుల్లో ఎంతైనా ఉందన్నారు. సమస్యలను గుర్తించడంతో పాటు వాటిని పరిష్కరించేంత వరకు ఎనలేని పోరాటాన్ని కొనసాగించే తత్వం అయినదని కొనియాడారు.

ట్రాఫిక్ కష్టాలు

పాలకొండ : మండలంలో కొండాపురంలో గ్రామ దేవత పండగ ముగింపు ఉత్సవాలు బుధవారం జరగడంతో శ్రీకాకుళం వెళ్లే రహదారి పూర్తిగా రద్దీగా మారింది. ఏలాం జంక్షన్ నుంచి గాయిత్రీ ఆలయం వరకు వాహనాలతో రద్దీగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు రాకపోకలకు కొంత ఇబ్బంది కరంగా మారింది. పోలీసులు చొరవ తీసుకుని ట్రాఫిక్‌ను సరిచేశారు.

చురుగ్గా సాగుతున్న మెయిన్‌రోడ్డు పనులు

ఎట్టకేలకు ప్రధాన రహదారి పనులు

వీరఘట్టం : మండల కేంద్రంలోని ప్రధాన రహదారి విస్తీర్ణం, అభివృద్ధి పనులు బుధవారం ఎట్టకేలకు ప్రారంభించారు. గ్రామంలో ఈనెల 7, 8, 9 తేదీల్లో పైడితల్లి అమ్మవారి గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా తెలగవీధి జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు గ్రామదేవత ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకాలు ఉండకుండా ఉండేందుకు ఉన్న రహదారిని జెసిబిల ద్వారా తొలగించి ప్రస్తుతం వాటిపై 40 ఎంఎం గల చిప్స్ వేసి రోలింగ్ చేస్తున్నారు. మరోవైపు కాలువలపై పలకులు అమర్చేందుకు ముమ్మరంగా చేపడుతున్నారు.

డిసిఎంఎస్ స్థల పరిశీలన

పాలకొండ : పట్టణంలోని నాగవంశపువీధి జంక్షన్ దగ్గర డిసిఎంఎస్ స్థలాన్ని డిసిఎంఎస్ అధికారులు దేవరాజు పరిశీలించారు. డిసిఎంఎస్ స్థలం ఎవరూ ఆక్రమించుకోకూడదని, ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంబంధిత వార్డు కౌన్సిలర్ ప్రతినిధి పల్లా భానుతో మాట్లాడారు. డిసిఎంఎస్ స్థలం ఎంత ఉంది, రైతు బజారుకు తాము ఎంత కేటాయించాలన్న దానిపై కూడా నివేదికలు తయారు చేస్తామన్నారు.

డిసిఎంఎస్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, కౌన్సిలర్

అర్హులైన ప్రతిఒక్కరికీ జాబ్ కార్డు

ప్రజాశక్తి- పాచిపెంట

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ చట్టం ద్వారా జాబ్ కార్డులు మంజూరు చేసి పని కల్పిస్తామని డ్వామా పీడీ కె. రామచంద్రరావు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద విలేకర్లతో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది రూ.1.23కోట్ల పని దినాలు వేతన దారులకు కల్పించనున్నట్టు తెలిపారు. ఉపాధి పథకం ద్వారా 60 శాతం వేతన దారులచే మిగతా 40 శాతం మిషనరీలు ద్వారా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. 60 శాతం వేతనదారులకి సంబంధించి రూ.3.33 కోట్ల మెటీరియల్ రూపంలో రూ. 2.23కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రధానంగా సాగునీటి కాలువలు చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హులను గుర్తించి జాబ్ కార్డులు మంజూరయ్యేలా చూడాలని గ్రామ వాలంటీర్లకు ఆదేశించారు. 124 కిలోమీటర్ల పొడవున సాగునీటి కాలువలను వచ్చే ఏడాది మార్చి నాటికి అభివృద్ధి చేస్తామన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

మక్కువ : మండలంలోని కొయ్యనిపేట పంచాయతీ పరిధిలోని అయ్యప్ప చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్రరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో మాట్లాడుతూ రూ.272 వేతనాన్ని అందరూ అందుకోవాలని, ఆ దిశగా పనులు చేయాలని సూచించారు. ఫ్రీ మెజర్మెంట్ ప్రకారం పనులు జరిపించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ ఈశ్వరమ్మ, ఇసి విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : గ్రామాల్లో కూలీలకు నిబంధన మేరకు పనులు కల్పించాలని పాలకొండ డిఎల్‌డిఒ వి.గోపాలకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం

ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ త్రినాథులు

స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నాణ్యత ప్రమాణాలు కూడా పాటించాలని, పనికి తగ్గ వేతనం కల్పించేలా దృష్టి పెట్టాలన్నారు. అలాగే పని కావాల్సిన వారికి తక్షణమే పని కల్పించాలని, జాబ్ కార్డు కావాల్సిన వారికి తక్షణమే జాబ్ కార్డ్ మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతం ఉపాధి పనులు చేపట్టిన సంఖ్య కంటే మరింత సంఖ్య పెంచేందుకు చొరవ చూపాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ వై.వెంకటరమణ, ఎపిఒ జి.సత్యంనాయుడు, ఇసి, టిసి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: మండలంలోని గోపాలపురం, వెలగవాడలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ డొంక త్రినాథులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులు సమయపాలన పాటించి పనులు చేపట్టాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేపట్టి గిట్టుబాటు కూలి పొందాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

విగ్రహ ప్రతిష్ట చేస్తున్న పూజారులు

ఘనంగా వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట

సీతంపేట : : టిటిడి కొత్తగా సీతంపేటలో నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట బుధవారం ఘనం జరిగింది. ఈ కార్యక్రమంలో విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే టిటిడి వారు అరకు, పాడేరు తదితర గిరిజన ప్రాంతాల్లో దాదాపు 40 ఆలయాల నిర్మాణం చేపట్టిందన్నారు. ఇదేక్రమంలో సీతంపేటలో ఆలయ నిర్మాణం అద్భుతంగా నిర్మించారని చెప్పారు. ఈనెలలోనే రంపచోడవరంలో వెంకటేశ్వర ఆలయానికి మహాసంప్రోక్షణ జరుగనుందన్నారు. టిటిడి జెఇఒ వీరబ్రహ్మం మాట్లాడుతూ సీతంపేటలో నాలుగు ఎకరాల సువిశాలమైన స్థలంలో రూ.10 కోట్ల వ్యయంతో ఈ ఆలయ నిర్మాణం చేపట్టినట్టు చెప్పారు. తిరుపతికి రాలేని భక్తులు ఇక్కడ స్వామివారిని దర్శించుకునేందుకు వీలుగా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.కల్యాణ మండపం నిర్మించామని చెప్పారు. మహాసంప్రోక్షణ అనంతరం సీతంపేట పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిటిడి చైర్మన్ భార్య స్వర్ణలత రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, టిటిడి అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి చట్టం రక్షణకు 15న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

వామపక్షాలు, ప్రజాసంఘాల పోరాట ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని ప్రస్తుత బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుపన్నుతోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు విమర్శించారు. దీనిపై ఈనెల 15న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటనలో విడుదల చేశారు.ఉపాధి హామీ చట్టం వచ్చిన తర్వాత గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు, రైతాంగానికి, నిరుద్యోగ యువతకు ఆసరాగా నిలిచిందని అన్నారు. కరోనా వచ్చిన తర్వాత 15 కోట్ల మంది వలస కూలీలు తమ సొంత గ్రామాలకు చేరుకుని ఉపాధిని పొందుతున్నారని ఇలాంటి చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ ఈ ఏడాది బడ్జెట్లో రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించడం శోచనీయమన్నారు. రూ.2.50లక్షల కోట్లు నిధులు కేటాయించాల్సి ఉండగా ఈ ఏడాది బడ్జెట్లో కేటాయింపులు తగ్గించారని అన్నారు. రెండు పూటలా పినిపెట్టడం, మంచినీరు, మజ్జిగ అలవెన్సులు తీసివేయడం, గుణపాం, పార, తట్టలు అందించకపోవడం ఉపాధి కూలీలను ఇబ్బందులకు గురి చేస్తూ కూలీలు చేత మాకు ఈ పని వద్దని చెప్పించే ప్రయత్నాలు కేంద్ర ప్రభుత్వం చేస్తుందని దీన్ని వ్యవసాయ కార్మికులంతా ఈ కుట్రను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మేట్లును నియమించి వారికి ఎటువంటి ప్రోత్సాహకాలు ఇవ్వడంలేదని అన్నారు. కేరళ తరహాలో వంద రోజులు పని కల్పించి రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి చట్టాన్ని కాపాడుకోవడం కోసం ఈనెల 15న చేపడుతున్న ధర్నాలో పెద్ద ఎత్తున ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని గంగు నాయుడు కోరారు.

నేడు వాహనాల వేలం

సీతానగరం : స్థానిక పోలీస్ స్టేషన్లో వివిధ కేసుల్లో సీజ్ చేసిన రెండు వాహనాలను గురువారం వేలంపాట వేనట్లు ఎస్సై కె.నీలకంఠం తెలిపారు. ఈ వాహనాల వేలంపాటలో ఆసక్తి ఉన్న వారు వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

అనుమతుల్లేకుండా వాణిజ్య సముదాయ నిర్మాణాలు

- నివాస గృహాలను మారుస్తున్న వైనం
- కాలువల ఆక్రమణ
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయాల సెక్రటరీలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని పలు వీధుల్లోని ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న నివాస గృహాలను సంబంధిత భవన యజమానులు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా వాణిజ్య సముదాయాలుగా మారుస్తున్నారు. అయినా సంబంధిత మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు గానీ, ఆయా వార్డుల పరిధిలోని సచివాలయాల టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు గానీ కనీసం పట్టించుకోవడంలేదు. దీంతో భవన యజమానులు ఇష్టారాజ్యంగా మున్సిపల్ కాలువలనే ఆక్రమించి నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. మున్సిపల్ కాలువ దాటి ఆక్రమ నిర్మాణాలు చేపట్టడం వల్ల ఆ రహదారులపై రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకుండా భవన యజమానులతో కుమ్మక్కవుతున్నారని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వ నిబంధనల మేరకు గృహ, వాణిజ్యసముదాయాల నిర్మాణాలు చేసేందుకు సంబంధిత భవన నిర్మాణదారులు లైసెన్స్ టెక్నికల్‌పర్సన్ (ఎల్‌టిపి) ద్వారా ఆన్లైన్లో ప్లాన్ పెట్టి, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం ద్వారా అనుమతులు పొందాలి. ముందుగానే నిర్మాణం చేయదలుచుకున్న స్థలంలో ఆ ప్రాంతం రహదారి విస్తీర్ణం బట్టి 5 అడుగుల నుంచి 10 అడుగుల వరకు మున్సిపల్ కార్యాలయానికి రిజిస్ట్రేషన్ చేస్తే గాని నిర్మాణాలు చేపట్టకూడదు. కానీ అలాంటి నిబంధనలను పట్టించుకోకుండానే సంబంధిత యజమానులు గృహ, వాణిజ్య నిర్మాణాలను చేపడుతున్నారు. వీటితో పాటు కాలం చెల్లిన నివాస గృహాలను ఎలాంటి అనుమతుల్లేకుండా వాణిజ్య సముదాయాలుగా మారుస్తూ అటు టౌన్ ప్లానింగ్ విభాగానికి, ఇటు మున్సిపల్ రెవెన్యూ విభాగాల ఆదాయానికి గండి కొడుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కట్టడాలపై సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయాల టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు పర్యవేక్షణ చేసి మున్సిపల్ కార్యాలయానికి ఆదాయం తీసుకువచ్చే దిశగా కృషి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కాలువలపై నిర్మిస్తున్న వాణిజ్య సముదాయం

అనీమియా ముక్త భారత్ ప్రోగ్రాం తప్పనిసరి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

అనీమియా ముక్త భారత్ ప్రోగ్రాంను ప్రతి బుధ, శని వారాలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. స్థానిక పిహెచ్‌సిని, పలు సచివాలయాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. కొత్తూరు సచివాలయం పరిధిలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంను సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాన్ని, గొట్టివలస సచివాలయం పరిధిలో జరిగిన టీకా కార్యక్రమంను సందర్శించారు. స్థానిక పిహెచ్‌సిలో గర్భిణులకు ఉపయోగపడే కిల్కారీ యాప్ గురించి ఆశాలకు అవగాహన ఏ మేరకు ఉందో సమీక్షించారు. అనీమియా ముక్త భారత్ ప్రోగ్రామ్ లో భాగంగా అవసరమైన ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్‌లు, గర్భిణీలు, బాలింతలకు మధ్యాహ్న భోజన కార్యక్రమం తర్వాత ప్రతి రోజూ ఇవ్వాలని పేర్కొన్నారు. రెడ్ కలర్ ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఉన్నాయా లేదా అని సమీక్షించారు. అర్హులైన ప్రతీ పిల్లవానికి క్రమం తప్పకుండా టీకాలు వేయాలని సూచించారు.

వైద్యసిబ్బందికి సూచనలు చేస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

అలాగె హెల్త్ , వెల్నెస్ సెంటర్ దగ్గర అవసరమైన మందులు, పరీక్షలు ఉన్నాయో లేదో సమీక్షించారు. పిహెచ్‌సిలోలో ఇసిఆర్‌పి నిధులతో నిర్మిస్తున్న 6 పడకల వార్డ్ పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో సంబంధిత వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కిమ్మిలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండలంలోని కిమ్మిలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు, మధుమేహం, రక్తపోటు, జ్వరపీడితులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నవోనమ్మ, టెక్నీషియన్ దినేష్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ పాలనలో 20 ఏళ్లు వెనక్కి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అనుసరించిన విధానాల వల్ల అభివృద్ధిలో రాష్ట్రం 20ఏళ్ళు వెనక్కి వెళ్లిపోయిందని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు వెనక్కి మళ్లిపోతున్నాయని, నిరుద్యోగం బాగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల జగన్ పాలనలో కొత్తగా ఒక్క పరిశ్రమ రాష్ట్రానికి రాలేదని, ప్రభుత్వ పెద్దల అవినీతి, బెదిరింపుల వల్ల పారిశ్రామికవేత్తలు తిరిగి వెనక్కి మళ్లిపోతున్నారని తెలిపారు. అమరావతి పూర్తయితే రాష్ట్ర ఆదాయం, పోలవరం పూర్తి చేసి ఉంటే రైతుల ఆదాయం పెరిగేదని చెప్పారు. పిల్లల భవిష్యత్తు కోసం ప్రజలంతా ఆలోచించాలని, మళ్లీ సమర్ధుడైన చంద్రబాబు నాయుడుకి అవకాశం ఇచ్చి పరిపాలన పగ్గాలు అప్పచెప్పాలని కోరారు. అనంతరం టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికి ముఖ్యమంత్రి గతంలో ప్రారంభోత్సవాలు జరిగిన పోర్టులను ఎయిర్‌పోర్టులకు ప్రారంభోత్సవాలు చేస్తూ కొత్త నాటకాలకు తెరతీస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు జి రవికుమార్, డి మోహన్ రావు, నాయకులు ఉదయభాను, నందివాడ కృష్ణబాబు, కోల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీలు శత్రుచర్ల, ద్వారపురెడ్డి

పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రామప్పలనాయుడు

వరహాల గెడ్డలో పూడికలు తొలగింపు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపాలిటీ పరిధిలో గల వరహాల గెడ్డలో పేరుకుపోయిన గుర్రపు డెక్కలను, ఇతర మొక్కలను, చెత్త, వ్యర్థాలను జెసిబితో తొలగించే పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ జె.అప్పలనాయుడు ఎఇ జి.ఆనంద్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్ట్యా ఈ పూడికలు తొలగించడం జరుగుతుందని, దీంతో పాటు వరహాలగెడ్డ పరిసరాల్లో ఆక్రమణాలను కూడా తొలగిస్తామని తెలిపారు. వరహాలగెడ్డలో చెత్త వేయడం, ఆక్రమణలను చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

ఘటాలతో పురవీధుల్లో ఎమ్మెల్యే సందర్శన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టంలో ఈనెల 7,8,9 తేదీల్లో నిర్వహించనున్న పైడితల్లి అమ్మవారి గ్రామ దేవత ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి ఘటాలతో పురవీధుల్లో సందర్శించారు. ఏడేళ్ల తర్వాత గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గ్రామదేవత పండుగకు ఉత్సవ కమిటీ సభ్యులు ముమ్మరంగా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే బోయిడు పాలజంగిడితో పాటు దండకంతో పురవీధుల్లో సందర్శించడంతో భక్తులు భక్తి నిష్టలతో బోయుడు పాదాలు కడిగి అమ్మవారిని స్వీకరించారు.

అందుబాటులోకి పోస్టుమార్టం సేవలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానికంగా పోస్టుమార్టం సేవలు అందుబాటులోకి రావడంతో గిరిజన ప్రాంత ప్రజలు ఆనంద వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలు ప్రమాదాల్లో మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించేవారు. దీంతో గిరిజనులకు ఆర్థికంగా భారం ఉండేది. ఇదే సమస్యను పలుమార్లు ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వం ఎట్టకేలకు స్పందించి భద్రగిరి ఆసుపత్రి ఆవరణంలో పోస్టుమార్టం సేవలకు అవకాశం కల్పించింది. ప్రస్తుత ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి చొరవతో పోస్టుమార్టం భద్రగిరి ఆసుపత్రిలో ప్రారంభించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

మామిడి చెట్టు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కురుపాం

మామిడి చెట్టు నుండి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో గుమ్మలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. నందేడ మోహనరావు (40) గ్రామ సమీపంలో గల మామిడి తోటలో కాయలు కోసం చెట్టు ఎక్కి జారిపడి అక్కడకక్కడే మృతి చెందాడు. మృతుడుకు ఇద్దరు ఆడ పిల్లలు, ఒక కుమారుడు, భార్య ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి మృతదేహాన్ని తరలించినట్లు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మృతి చెందిన మోహనరావు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భామిని

మండలంలోని పసుకుడి గ్రామానికి చెందిన గౌడు రవి (33) రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. గౌడు రవి మంగళవారం రాత్రి 9గంటల సమయంలో గేదల మంద నుండి స్వగ్రామం పసుకుడి వచ్చే క్రమంలో భామిని మోడల్ స్కూల్ సమీపంలో బండి అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో స్థానికులు ఆయన్ను భామిని పిహెచ్‌సికు అక్కడి నుంచి సీతంపేట ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించే క్రమంలో మార్గం మధ్యలో చనిపోయాడు. అతనికి భార్య జ్యోతి, కుమారుడు సాయి, కుమార్తె రియా వుంది. బత్తిలి ఎస్ఐ వై. అమ్మన్నారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మృతుడు రవి (ఫైల్)

దాడిలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

గరుగుబిల్లి మండలం బురద వెంకటాపురానికి చెందిన బొత్స పెంటమనాయుడు అనే వ్యక్తి బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో భూమి విషయంలో పరిష్కారం కోసం వెళ్లగా, వారి బంధువులు బొత్స శ్రీహరి నాయుడు కుటుంబీకులు దాడి చేసి గాయపరిచారు. స్పందించిన స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

ఖాతా నుంచి రూ.22వేలు మాయం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని లంక వీధికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఉగిరి లక్ష్మణరావు ఖాతా నుండి రూ. 22 వేలు మాయమైనట్లు బుధవారం యూనియన్ బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈనెల రెండో తేదీన సాయంత్రం రూ. 2వేలు, రాత్రి మరో రూ. 10వేలు, బుధవారం ఉదయం రూ. 10వేలు గుర్తు తెలియని వ్యక్తులు ఖాతా నుంచి నగదు మాయం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. గతంలో కూడా ఇదే బ్యాంకు నుండి మండల కేంద్రానికి చెందిన భోగి శ్రీధర్, భోగి ప్రదీప్‌లకు చెందిన ఖాతాల నుండి నగదు మాయమైన విషయం తెలిసిందే. వీటిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు బ్యాంకు అధికారులను వేడుకొన్నారు.

వివాహిత అదృశ్యం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని డోకిశీల పంచాయతీ చెరుకుమడివలసకు చెందిన కొట్టక్కి చిరంజీవి తన భార్య గత నెల 26 నుంచి కనిపించడం లేదని బుధవారం పార్వతీపురం రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఉపాధి పనులకు వెళ్లిన తన భార్య తిరిగి రాకపోవడంతో గత కొద్దిరోజులుగా అత్తవారిల్లు సమీప బంధువుల ఇంట్లో వాకబు చేశామని ఎంతకీ కనబడకపోవడంతో రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై ఎస్సై సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.